
సాక్షి ఒడిశా

ఆదివారం । 17 । నవంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 7.90.527

బంగారం : 7 గ్రాముల 790 మిల్లీ గ్రాములు

వెండి : 119 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

రాష్ట్రంలో విమానయానం విస్తరణ

భువనేశ్వర్: రాష్ట్రంలో విమానయానం విస్తరిస్తున్నారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఝార్సుగడ వీర సురేంద్ర సాయి విమానాశ్రయం నుంచి దేశంలో 9 నగరాలకు ప్రత్యక్ష విమానయాన సౌకర్యం త్వరలో అందుబాటులోకి రానుంది. స్థానిక విమానాశ్రయం నుంచి 4 వీర సురేంద్ర సాయి విమానాశ్రయం నుంచి 5 నగరాలకు ప్రత్యక్ష విమానయాన సౌకర్యం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇండోర్, డెహ్రాడున్, కొచ్చి, జైపూర్ మరియు లక్నో ప్రాంతాలకు, ఝార్సుగుడ వీర సురేంద్ర సాయి విమానాశ్రయం నుంచి ముంబై, హైదరాబాదు, రాయపూర్ మరియు లక్నో ప్రాంతాలకు ప్రత్యక్ష విమానయానం ప్రారంభం అవుతుంది.

న్యూస్‌రీల్

అయ్యప్పస్వామి భక్తుల సందడి



కావుళ్లతో నదీ జలాలను తీసుకువస్తున్న అయ్యప్పభక్తులు

రాయగడ: అయ్యప్ప దీక్షను చేపట్టిన భక్తులు శనివారం స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఒంటినిండా పసుపును పూసుకుని స్వామి వారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకు వెళ్లి స్థానిక జంఝావతి నదిలో అభిషేకించారు. అనంతరం కావళ్లతో గంగాజలాలను తీసుకువచ్చి సన్నిధానంలో నిలిపి విశేషపూజలు, భజనలు చేశారు.

పార్టీ నాయకుడికి పరామర్శ



చికిత్స పొందుతున్న మాజీ మంత్రి సమీర్ దేని పరామర్శించిన ముఖ్యమంత్రితో ఉప ముఖ్యమంత్రి

భువనేశ్వర్: రాష్ట్ర నగర అభివృద్ధి శాఖ మంత్రి సమీర్ దే అస్వస్థతకు గురయ్యారు. ఈ నెల 1వ తేదీన కటక్ నగరం ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య బాగోగులు తెలుసుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆస్పత్రిని ప్రత్యక్షంగా సందర్శించారు. చికిత్స చేస్తున్న వైద్య బృందంతో ఉన్నత చికిత్స కోసం సంప్రదించారు. ముఖ్యమంత్రితో ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా కూడా తోటి సీనియర్ నాయకుని పరామర్శించారు.

జగన్నాథ్ సాగర్ పనులు త్వరలోనే పూర్తి చేస్తాం



సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

జయపురం: కార్తీక పూర్ణిమి సందర్భంగా శుక్రవారం రాత్రి జగన్నాథ్ సాగర్ ప్రాంతం రాజు సాహీలో బొయిత బంధన కార్యక్రమం నిర్వహించారు. శ్యామల పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాచీన ఉత్కళ నౌకావాణిజ్యం, సంస్కృతిని వివరించారు. సాగర్ పునరుద్ధరణ పనులు త్వరలోనే పూర్తి చేయటం జరుగుతుందని వెల్లడించారు. గౌరవ అతిథిగా హాజరైన మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతిని, సీనియర్ సిటిజన్లు నీలకంఠ మిశ్ర, ఉత్తమ నాయక్, హరిహర త్రిపాఠిని సన్మానించారు స్థానిక కళాకారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

ఏనుగుల బెడద.. గ్రామస్తుల ఆగ్రహం



గ్రామస్తులు చెట్టుకు కట్టేసిన ఫారెస్టరు బిశ్వాస్ బెహరా

భువనేశ్వర్: ఏనుగుల బెడదతో వేసారిన గ్రామస్తులు తీవ్ర ఆగ్రహానికి గురి అయ్యారు. జనావాసాల్లోకి ఏనుగుల చొరబాటు నివారించడంలో విధి నిర్వహణలో ఉన్న ఫారెస్టరు విఫలం కావడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని గ్రామస్తుల ఆరోపణ. ఈ ఆగ్రహంతో ఫారెస్టరు బిశ్వాస్ బెహరానిక చెట్టుకు కట్టేశారు. దేవ్‌గడ్ జిల్లా రియామల్ రేంజ్ నువాడిహి బీట్ భేజికుదర్ గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. శుక్ర వారం అర్ధ రాత్రి పూట ఫారెస్టరుని గిరేసి కట్టి పడేశారు. అటవీ శాఖ అధికారులు సకాలంలో చొరవ కల్పించుకుని తోటి సిబ్బంది ఫారెస్టరుని గ్రామస్తుల ఆగ్రహం నుంచి ఎలాంటి హాని లేకుండా కాపాడారు. ఏసీఎఫ్ అరుణ్ కుమార్ బెహరా, రియామల్ రేంజర్ నిరంజన్ ధరువా ఘటనా స్థలం చేరుకుని ఆగ్రహించిన గ్రామస్తుల్ని బుజ్జగించి కట్టేసిన ఫారెస్టరుని సురక్షితంగా విడుదల చేయించారు.

ఇంటి వెనుక నోట్ల కట్టలు

- దోపిడీ చేసిన సొమ్మును ఇంటి వెనుక గోతిలో పాతిపెట్టిన వైనం
- గుర్తించిన పోలీసులు
- అదుపులో ఓ నిందితుడు
- పరారీలో ప్రధాన నిందితుడు



దోపిడీ సొమ్ము గాలింపు



గత్తం కుప్ప నుంచి బయటపడిన దోపిడీ సొమ్ము

భువనేశ్వర్: దొంగిలించిన సొమ్మును ఏం చేయాలో తెలీక ఇంటి వెనుక గత్తం కింద దాచిపెట్టాడో ప్రబుద్ధుడు. పోలీసులు గుట్టు రట్టు చేయడంతో పరారైపోయాడు. హైదరాబాద్ వ్యవసాయ పరిశ్రమలో పని చేస్తున్న సిబ్బంది సొమ్మును దొంగిలించి దాచాడు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక పోలీసు దర్యాప్తు బృందం రాష్ట్రానికి విచ్చేసి ఈ దోపిడీ గుట్టు రట్టు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

బాలాసోర్ జిల్లా బొడొమొందారుణి గ్రామానికి చెందిన గోపాల్ బెహరా అనే వ్యక్తి హైదరాబాద్‌లో ఓ కంపెనీలో పని చేస్తున్న సిబ్బంది నుంచి రూ. 21 లక్షలు దోచుకున్నాడు. దోచుకున్న నగదుని బావమరిది ద్వారా స్వస్థలానికి సురక్షితంగా తరలించాడు. నిందితుని అత్తమామలు ఈ సొమ్ముని సంచిలో పదిల పరచి ఇంటి పెరట గత్తం కుప్ప కింద దాచి పెట్టారు.

గోపాల్ బెహరా గత పదేళ్లుగా ఈ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ అనుభవంతో లాకరు రహస్య నంబరు వగైరా అనుబంధ సమాచారం గుట్టుగా తెలుసుకుని భారీ మొత్తాన్ని కాజేశాడు. కాజేసిన సొమ్ముని బావమరిది ద్వారా జలేశ్వర్‌లో అత్త వారింటికి తరలించాడు. కంపెనీలో నగదు గల్లంతు విషయమై దాఖలైన ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్ దర్యాప్తు బృందం రాష్ట్రానికి చేరింది. స్థానిక కొమొర్దా ఠాణా పోలీసుల సహకారంతో నిందితుని అత్త వారింటికి చేరి గాలింపు, తనిఖీలు చేపట్టింది. దర్యాప్తులో ఇంటి పెరట్లో గత్తం కుప్ప కింద దోచుకున్న సొమ్ము పాతిపెట్టినట్లు గుర్తించారు. గత్తం కుప్ప తవ్వడంతో వాస్తవం తేలింది. మరో వైపు ప్రధాన నిందితుడు, అతని మామ ఉమాకాంత బెహరా పరారీలో ఉన్నాడు. అతని బావమరిది రబీంద్ర బెహరాని దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుని అత్త బాసంతి బెహరాని కూడా ప్రశ్నిస్తున్నారు. గత్తం తవ్వడంతో రూ. 15 లక్షలు మాత్రమే బయటపడినట్లు దర్యాప్తు బృందం వివరించింది. ఈ నెల 11న హైదరాబాదు వ్యవసాయ కంపెనీలో రూ. 21 లక్షల చోరీకి గురైంది. దీని ఆధారంగా దర్యాప్తు బృందం రంగంలోకి దిగింది. ఇక్కడ దొరికిన డబ్బును స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన సొమ్ము కోసం గాలిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్, ఫోను సంభాషణ వివరాలు ఆధారంగా దోపిడీ నుంచి తరలింపు వరకు జరిగిన ప్రక్రియ గుట్టు రట్టుకు దర్యాప్తు బృందం వ్యూహ రచన చేసింది. కేసు విచారణ, దర్యాప్తు కొనసాగుతుంది.



దర్యాప్తు బృందానికి చిక్కిన దోపిడీ సొమ్ము



చేతికి చిక్కిన నోట్ల కట్టలు

అమ్మో లీకేజీ..!



డ్యామ్ నుంచి నీరు లీక్ అవుతున్న దృశ్యం

జయపురం: జయపురం, బొరిగుమ్మ, కొట్‌పాడ్ సమితుల్లో 9952.22 హెక్టార్లకు సాగునీటిని సమకూర్చేందుకు రూ.1276 కోట్ల వ్యయంతో నిర్మించిన తెలింగిరి సాగునీటి ప్రాజెక్టు డ్యామ్ గార్డ్ వాల్ నుంచి నీరు లీక్ కావడం అధికారులను కలవరపరుస్తోంది. లీకేజీకి గల కారణాలు అధ్యయనం చేసేందుకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ నుంచి ఆరుగురు సభ్యుల టీమ్ వచ్చి పరిశీలించింది. వారు పరిశీలనలో తెలుసుకున్న విషయాలను అధికారులకు నివేదించేందుకు రిపోర్టు తయారు చేశారు. శనివారం ఆ టీమ్ తమ రిపోర్టుపై ఉన్నత స్థాయి అధికారులతో చర్చించారు. లీకేజీ వలన ప్రతి అర్ధ గంటకు డ్యామ్ నుంచి 25 క్యూసెక్కుల నీరు బయటకు పోతోంది. దీని వల్ల 24 గంటల్లో డ్యామ్ నీటి మట్టం 1 మీటరు కిందికి పడిపోయిందని, అందు వల్ల కిందకు వెళ్లి పని చేయడం సాధ్యం కాదని టీమ్ వెల్లడించినట్లు సమాచారం. ఈ పరిస్థితిలో డ్యామ్ పనులు చేయాలంటే డ్యామ్‌లో ఉన్న నీరంతా విడిచి పెట్టాలని అభిప్రాయపడినట్లు తెలిసింది. డ్యామ్ లీకేజీ ముందు నీటి మట్టం 632.7 మీటర్లు ఉండగా నేడు 631.8 మీటర్లకు తగ్గిందని సమాచారం. డ్యామ్‌లో నిల్వ ఉన్న నీరు బయటకు విడవాలంటే మూడు స్పిల్‌వే లు, ఒక అత్యవసర హోల్ ద్వారా విడిచి పెట్టాలని అందుకు 10 నుంచి 15 రోజులు పడుతుందని అంచనా. అదే జరిగితే డ్యామ్ ఖాళీ అవుతుందని, అందువలన రానున్న రబీ సీజన్‌లో జయపురం, బొరిగుమ్మ, కొట్‌పాడ్ సమితిలలో సాగునీటి సరఫరా పై ప్రభావం పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

న్యాయ విచారణ గడువు పొడిగింపు



భరతపూర్ పోలీసు ఠాణా

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపిన భరత్ పూర్ ఠాణాలో పోలీసుల దాడి కేసు విచారణ కోసం నియమించిన న్యాయ కమిషన్ గడువు ప్రభుత్వం పొడిగించింది. హైకోర్టు విరామ న్యాయమూర్తి జస్టిస్ చిత్త రంజన్‌దాస్ అధ్యక్షతన ఏకసభ్య న్యాయ విచారణ కమిషను నియమించారు. రెండు నెలల్లో ఈ విచారణ పూర్తవుతోందని లోగడ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 22వ తేదీతో జస్టిస్ చిత్తరంజన్ దాస్ ఏకసభ్య న్యాయ కమిషను విచారణ ముగియాల్సి ఉంది. అయితే విచారణ కొనసాగుతన్నందున మరో 70 రోజుల పాటు పొడిగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో న్యాయ కమిషను విచారణ గడువుని వచ్చే ఏడాది జనవరి నెల 31వ తేదీ వరకు పొడిగించారు.

☛ 500 అఫిడవిట్లు దాఖలు

న్యాయ కమిషన్ విచారణ పురస్కరించుకుని 500 అఫిడవిట్లు దాఖలు అయ్యాయి. ప్రస్తుతానికి 16 మంది అభ్యర్థులకు కమిషన్ విచారణ కోసం సమన్లు జారీ చేసింది. దాఖలైన అఫిడవిట్లు పరిశీలించిన మేరకు తదుపరి కార్యాచరణ చేపడుతుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీ అర్ధరాత్రి పూట పోలీసుల సహకారం కోసం ఆశ్రయించిన మేజరు, అతని స్నేహితురాలిపై పోలీసుల ప్రవర్తన అభ్యంతరకరమై తీవ్ర కలకలం రేపింది. ఈ సంఘటనలో ఠాణా ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి దీన కృష్ణమిశ్రాతోసహా మరో నలుగురు పోలీసు సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. మరో వైపు క్రైం శాఖ దర్యాప్తు కొనసాగుతుంది. ఈ నెల 14న బాధిత మేజర్, అతని స్నేహితురాలు న్యాయ విచారణ కమిషన్ ఎదుట హాజరయ్యారు. వీరి వాంగ్మూలం నమోదు చేశారు.

అప్పు తీర్చనందునే హత్య



మృతుడు రాధాకృష్ణ మహాపాత్రో



హత్య చేసిన నిందితులు

కొరాపుట్: కలప డబ్బులు బాకీ వివాదం వల్లనే వ్యాపారి హత్యకు గురయ్యారు. శనివారం కొరాపుట్ జిల్లా సునాబెడా ఎస్‌డీపీఓ మనోబ్రత సత్పతి ఈ వివరాలు ప్రకటించారు. జయపూర్‌కి చెందిన కలప వ్యాపారి రాధాకృష్ణ మహాపాత్రో (55) నీలగిరి కర్రల వ్యాపారం చేస్తున్నారు. పొట్టంగి పోలీస్ స్టేషన్ పరిధిలో కొందరికి రూ.2 లక్షలు బాకీ ఉన్నారు. ఆ డబ్బులు చెల్లించకపోవడంతో వారందరూ కలిసి రాధాకృష్ణను సుంకీ ఘాట్‌లో హత్య చేసి లోయలో పడేశారు. రాధాకృష్ణ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరునాడు అతని మృతదేహం కనిపించడంతో పొట్టంగి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతుని మోటారు బైక్ రహస్య ప్రాంతంలో దొరకడంతో కేసు చిక్కుముడి వీడింది. ఈ హత్యకి పాల్పడిన నరేంద్ర సొర, కార్తిక్ గుంట, నిరా సొరా, సస్‌సద్ పడియా, తిరుపతి పడియాలను అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి జైలుకి తరలించినట్లు ఎస్‌డీపీఓ ప్రకటించారు.

లింగరాజ్‌నగర్‌లో చోరీ

- బంగారం, వెండి, నగదు దొంగతనం



తెరిచి ఉన్న బీరువా



ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసులు

జయపురం: లింగరాజ్‌నగర్‌లో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. స్మృతి సాగర్ పండా ఇంటికి వేసిన తాళాలు బద్దలుగొట్టారు. బీరువా తాళాలు తెరచి 5 తులాల బంగారు నగలు, 500 గ్రాముల వెండి సామాన్లు, రూ.50 వేల నగదుతో పాటు, ఇంటి వద్ద గల స్కూటీని దుండగులు దోచుకు పోయారు. దొంగతనం జరిగినట్లు ఇంటి యజమాని స్మృతి సాగర్ పండా పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ పోలీస్ అధికారి ర్శ్మిరంజన్ దొలాయి శనివారం వెల్లడించారు. కార్తీక పూర్ణమ కావటం వలన సాగర్ పండా కుటుంబ సభ్యులు పూజలు చేసేందుకు వెళ్లారు. వారు ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి స్కూటీ కనిపించలేదు. అనుమానం వచ్చి ఇంటిలోనికి వెళ్లి చూడగా పడక గదిలో అలమారా తెరిచి ఉంది. బీరువాలో దుస్తులు, ఇతర వస్తువులు చిందరవందరగా పడిఉండటంతో దొంగతనం జరిగినట్లు అనుమానించారు. దైవ పూజలకు వినియోగించే వెండి సామగ్రి, బంగారు నగలు, డబ్బు కనిపించకపోవటంతో ఖంగుతిన్నారు. బయట ఉన్న మోఫెడ్‌ను తీసుకువెళ్లేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. ఏఎస్‌ఐ సత్యబాది నాయక్ సిబ్బందితో వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. పరిసర ప్రాంతాలలో గల సీసీ కెమారాల పరిశీలించారు. దుండగుల ఆచూకీ తెలుసుకున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం



మల్కన్‌గిరి: విలేకరులతో చర్చిస్తున్న కలెక్టర్ ఆశిష్



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్



మాట్లాడుతున్న జర్నలిస్టు ద్విజెన్ పాఢి



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సీడీఎం గుణనిధి నాయక్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ పత్రికా దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ హాజరై మల్కన్‌గిరి విలేకరుల పనితనాన్ని మెచ్చుకున్నారు. అధికారులకు ప్రజలకు వారధులుగా ఉంటూ విలేకరులు చేస్తూ సేవ గొప్పదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన బోయి, జిల్లా కౌన్సిల్ ఫైనాన్స్ మేనేజర్ మానస్ మిశ్రో, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ప్రమిళ మాఝి, జిల్లా విలేకర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు పత్రికలు పని చేయాలి

రాయగడ: సమాజ శ్రయస్సు కోసం పత్రికలు స్వేచ్ఛగా పని చేయాలని రాయగడ సబ్ కలెక్టర్ సంఘమిత్రా దేవి, ఏడీఎం భాస్కరరైతా అన్నారు. జాతీయ పత్రికా దితోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. జిల్లా పౌరసంబంధాలశాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాత్రికేయుల బాధ్యత, సమాజా శ్రేయస్సుకు చేయాల్సిన కృషిని సబ్ కలక్టర్ వివరించారు. అనంతరం పాత్రికేయులను సన్మానించారు.

విలేకరులు బాధ్యత మరువరాదు

పర్లాకిమిడి: పత్రికా విలేకరులు విధి నిర్వహణలో బాధ్యతను విస్మరించకూడదని కలెక్టర్ బిజయకుమార్ దాస్ జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సమావేశంలో డీఎస్పీ సునీల్ కుమార్ మహాంతి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్య నిర్వహణ అధికారి డాక్టర్ గుణనిధినాయక్, గజపతి జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు గరుడధ్వజ చౌదరి, ఉత్కళ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ద్విజెన్ పాఢిలు పాల్గొన్నారు. డీపీఆర్ఓ ప్రదిప్త గురుమయి అధ్యక్షత వహించారు. మారుతున్న పత్రికా విధానం, డిజిటల్ మీడియాపై కలెక్టర్ బిజయ కుమార్ దాస్ స్పందిస్తూ మాట్లాడారు. ఇప్పుడు అంతా నెట్‌ఫ్లిక్స్, మొబైల్‌లో ప్రపంచ వార్తలు క్షణకాలంలో మన ముందుకు వచ్చేస్తున్నాయి. అనంతరం సీనియర్ జర్నలిస్టు ద్విజెన్ పాఢి మాట్లాడుతూ, చాలా పత్రికలు బడా క్యాపిటలిస్టులు చేతులు మారిన కారణంగా అవి అధికార ప్రభుత్వాలకు అనుగుణంగా వార్తలు ప్రచురిస్తున్నాయని అన్నారు. ఈ రంగంలో మనుగడ సాగించాలంటే మారుతున్న కాలంలో జర్నలిస్టులు టెక్నాలజీని అందిపుచ్చుకుని ముందుకు పోవాలని అన్నారు.

రాష్ట్రంలో కొత్తగా 3 ఓంఫెడ్ డెయిరీ ప్లాంట్లు



మంత్రి గోకులానంద మల్లిక్ అధ్యక్షతన ఓంఫెడ్ సమీక్ష సమావేశం

భువనేశ్వర్: ఒడిశా పాడి ఉత్పాదకుల సమాఖ్య ఓంఫెడ్ రాష్ట్రంలో కొత్తగా మరో మూడు డెయిరీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. వీటిని సంబల్‌పూర్, బరంపురం, బాలాసోర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు మత్స్య, పశు వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ తెలిపారు. ఆయన అధ్యక్షతన శనివారం ఓంఫెడ్ సమీక్ష సమావేశం జరిగింది. ఓంఫెడ్ ఉత్పాదనల నాణ్యత, పరిమాణంలో ఏమాత్రం రాజీ కుదరకుండా ముందుకు సాగుతుందని మంత్రి అభయం ఇచ్చారు. ఉత్పాదన ప్రాంగణాల్లో ఈ కార్యకలాపాలపై నిఘా వేసేందుకు పటిష్టమైన సీసీటీవీ వ్యవస్థ నిరంతరం పని చేస్తుందన్నారు. కొత్త డెయిరీ ప్లాంట్ల ఏర్పాటు కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక డీపీఆర్ సిద్ధమైందని మంత్రి ప్రకటించారు.

కొత్త ఉత్పాదనలు

ఒడిశా పాడి ఉత్పాదకుల సమాఖ్య కొత్త ఉత్పాదనలతో ఉత్పాదక శక్తిని విస్తరిస్తుంది. అతి త్వరలో ఓంఫెడ్ తాగు నీరు, చాక్లెట్లు మరియు ఐస్ క్రీం మార్కెటులోకి ప్రవేశ పెట్టనుంది.

పంచాయతీలో పార్లర్లు

రాష్ట్రంలో పలు పంచాయతీల్లో ఓంఫెడ్ పార్లర్లు ఏర్పాటు కానున్నాయి. ప్రతి పంచాయతీలో క్షీరధార మిషన్ పని చేస్తుంది. ఇప్పటి వరకు 20 పంచాయతీల్లో క్షీరధార మిషన్ పని చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

బకాయిల వసూలు

బకాయిల వసూళ్లపై ఓంఫెడ్ కట్టుదిట్టంగా వ్యవహరిస్తుంది. బకాయి భారం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతానికి సుమారు రూ. 2 కోట్ల బకాయి ఉంది. దీనిలో రూ. 82 లక్షలు ఆదా చేశారు. మరో 7 రోజుల్లో మిగిలిన బకాయి చెల్లించకుంటే కఠిన చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి హెచ్చరించారు.

ప్రత్యక్ష నగదు బదిలీ

ఓంఫెడ్‌కు పాలు పంపిణీ చేసే పాడి రైతులకు నగదు బదిలీ వ్యవస్థ సరళీకరించారు. ఇక నుంచి ఈ వర్గానికి చెల్లించాల్సిన నగదు ప్రత్యక్షంగా సంబంధిత బ్యాంకు పొదుపు ఖాతాలకు బదిలీ (డీబీటీ) అవుతుందని మంత్రి తెలిపారు. ప్రాంతీయ క్షీరధార కేంద్రాల్లో పాలు చేరదీయడంతో తగిన మొత్తం తక్షణమే ప్రత్యక్షంగా బదిలీ అవుతుంది. త్వరలో ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుంది.

బిర్సాముండాకు ఘనంగా నివాళి

పర్లాకిమిడి:

ఆదివాసీ నాయకుడు బిర్సా ముండా జయంతిని గజపతి జిల్లా మోహనాలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ జనజాతీయ గౌరవ దినోత్సవంలో ఎంపీ డాక్టర్ ప్రదీప్ పాణిగ్రాహి, మోహనా శాసనసభ్యులు దాశరథి గోమాంగో, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సీడీఎం డాక్టర్ గుణనిధి నాయక్, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ మహ్మద్ ఆలీ, మోహనా బీడీఓ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆదివాసీ నాయకుడు బిర్సాముండా రాష్ట్రంలో ఆదివాసీలకు చేసిన సేవలను కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనజాతి ప్రజల అభివృద్ధి, వారి ఆర్థిక స్థితి ఉన్నతికి అనేక కొత్త పథకాలు ప్రవేశపెట్టనున్నట్లు ఎంపీ తెలిపారు. రాష్ట్రంలో నలభై శాతం ఎస్టీలు ఉన్నారని వారికి ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగాలు, వివిధ పథకాల్లో తొలి ప్రాధాన్యం బీజేపీ ప్రభుత్వం ఇవ్వనుందని చెప్పారు. సభలో ఆదివాసీ నాయకులు మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో ప్రజలకు ఉద్దేశించి మాట్లాడారు. జంగిల్, భూపట్టాలు, చదువు ,ఉపాధి, అనేక రంగాల్లో అనేక రాయితీలు కల్పించాలన్నారు. అనంతరం ఎస్టీ లబ్ధిదారులుక పీఎంఏవై, వివిధ స్వయం సహాయక గ్రూపులకు చెక్కులను ఎంపీ పాణిగ్రాహి చేతులమీదుగా అందజేశారు. అనంతరం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళా గ్రూపులు ఏర్పాటుచేసిన వివిధ చేతివృత్తులు స్టాల్స్‌ను అధికారులు తిలకించారు.



మోహనాలో జనజాతీయ గౌరవ దినోత్సవంలో ఎంపీ డాక్టర్ ప్రదీప్ పాణిగ్రాహి, కలెక్టర్, మోహనా, పర్లాకిమిడి ఎమ్మెల్యేలు



పీఎంఏవై కింద లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎంపీ డాక్టర్ ప్రదీప్ పాణిగ్రాహి, కలెక్టర్

క్లుప్తంగా

వ్యాన్‌ను ఢీకొట్టిన బైక్



ప్రమాదస్థలంలో దృశ్యం

రణస్థలం: మండలంలోని పైడి భీమవరం ఫ్లైఓవర్‌పై ముందు వెళ్తున్న డీసీఎం వ్యాన్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. వివరాల్లోకి వెళ్తే.. జి.సిగడాం మండలంలోని అద్వానంపేట నుంచి విశాఖపట్నానికి ఒకే ద్విచక్ర వాహనంపై భార్యభర్తలు, వారి ఇద్దరు కుమార్తెలు వెళ్తున్నారు. శనివారం ఉదయం 11.20 గంటల సమయంలో పైడి భీమవరం వంతెనపై డీసీఎం వ్యాన్ సడన్ బ్రేక్ వేయడంతో బైక్ అదుపు చేయలేక వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో పిల్ల పాపయ్య(రమేష్) తలకు తీవ్ర గాయంతో పాటు ఒంటిపై బాగా గాయాలయ్యాయి. అతని భార్య రాజేశ్వరికి ఒక కాళ్లు విరిగింది. కుమార్తె పిల్ల లాస్యకు రెండు కాళ్లు విరగడంతో పాటు తీవ్ర గాయాలైయ్యాయి. మరో కుమార్తె సమీరాకు ఎటువంటి గాయాలు కాలేదు. వీరిని 108 వాహనంపై శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రమేష్ విశాఖపట్నంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో అధ్వానంపేటలో ఎలక్ట్రికల్ పనుల చేసుకుని ఉదయం 10.30 గంటల సమయంలో బయల్దేరి విశాఖపట్నం వెళ్తున్నారు. శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు ఎంఎల్‌టీ కేసు నమోదు చేశారు.

పన్ను బకాయిలతో భవనం సీజ్



కెనరా బ్యాంక్ భవనాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భవనానికి సంబంధించి పన్ను బకాయిలు రూ.7 లక్షలు చెల్లించలేదని కార్పొరేషన్ అధికారులు సీజ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని రామకృష్ణా థియేటర్ సందులో మగటపల్లి శంకరరావుకి చెందిన భవనాన్ని శనివారం కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఉమామహేశ్వరరావు, నరేష్‌లు సీజ్ చేశారు. ఈ భవనంలో ప్రస్తుతం కెనరా బ్యాంక్, సహారా కార్యాలయం, కమర్షియల్ టాక్స్ కార్యాలయం ఉన్నాయి. ముందుగా హెచ్చరికలో భాగంగా మూడో అంతస్తులో బ్యాంక్‌ను మూసినట్లు తెలిపారు. అప్పటికీ కట్టకుంటే అన్ని కార్యాలయాలు మూసేయడం తప్పదని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులతో పాటు అడ్మిన్ సెక్రటరీలు సంజయ్‌కుమార్, నాయుడులు ఉన్నారు.

ఆలయంలో చోరీ

జలుమూరు: మండలంలో కూర్మనాథపురం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ గుడి హుండీ చోరీకి గురై, సుమారు రూ.20 వేల నగదు, కొన్ని వెండి వస్తువులు పోయినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగతనం శుక్రవారం రాత్రి 12 గంటల తర్వాత జరిగి ఉంటుందని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. శనివారం వేకువజామున ఆలయంలో పూజలకు వెళ్లిన భక్తులు ఆలయం ముందు హుండీ లేకపోవడంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించారు. గ్రామస్తులతోపాటు రోడ్డు వెంబడి నిత్యం వెళ్లేవారు కానుకలు, దక్షిణ రూపేణా కొంత నగదు వేస్తుంటారని, ఏడాదికి ఒకసారి మాత్రమే హుండీ తెరుస్తామని గ్రామస్తులు వివరించారు.

డీఐజీ సమీక్ష



ఐదు జిల్లాల అధికారులతో డీఐజీ గోపినాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్: విశాఖ రేంజి పరిధిలోని ఐదు జిల్లాల ఇన్‌స్పెక్టర్లు, లీగల్ అడ్వైజర్లతో డీఐజీ గోపినాథ్ జెట్టి విశాఖ రేంజి కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగుకు ఆర్థికంగా మద్దతు తెలుపుతున్న వ్యాపారస్తులను పట్టుకోవడం, గంజాయి కేసుల్లో వివిధ రూపాల్లో కూడబెట్టిన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు.

అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో పర్యాటకుల సందడి (ఫైల్)



జాగ్రత్తగా ఉండి తీరాలి

- జిల్లాలోని బీచ్‌లలో మొదలుకానున్న పిక్నిక్ సందడి
- సముద్ర తీరాల్లో అప్రమత్తత అవసరం
- అనవసర సాహసాల జోలికి వెళ్లవద్దని పోలీసుల విజ్ఞప్తి

అల ప్రమాదాల వల వేస్తుంది. ఆహ్లాదంగా కనిపించే తీరం మాటున అపాయం దాగి ఉంటుంది. కాసింత ఏమరపాటుగా ఉన్నా కనురెప్ప పాటులో కడలి తనలో కలిపేసుకుంటుంది. పిక్నిక్‌ల కోసం సముద్ర తీరాలకు వెళ్లేవారికి గత ప్రమాదాలే హెచ్చరికలు. జాగ్రత్తలు తీసుకోకపోతే అపాయం తప్పదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో విన్యాసాలు చేస్తున్న యువకులు

టెక్కలి/వజ్రపుకొత్తూరు రూరల్:

జిల్లాలో సువిశాలంగా 193 కిలోమీటర్ల విస్తీర్ణంలో గల సముద్ర తీర ప్రాంతంలో 11 మండలాల పరిధిలో అనేక చోట్ల బీచ్‌లు ఉన్నాయి. ఏటా ఏదో ఒక బీచ్ వద్ద ప్రమాదాలు చోటు చేసుకుని ఎంతో మంది యువకులు బలైపోతున్నారు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఈ ప్రమాదాలను నివారించవచ్చు.



- ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఆదమరిస్తే రాకాసి అలల తాకిడికి నీటిలో కొట్టుకుపోయే అవకాశం ఉంది.



- చెరువుల్లో మాదిరిగా సముద్రంలో ఈత కొట్టలేమని గ్రహించాలి.



- ప్రధానంగా మద్యం తాగి ఎట్టి పరిస్థితులోనూ సముద్రంలోకి దిగకూడదు. ఉప్పు నీటి కారణంగా మత్తు ఎక్కువై శరీరం స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంది.



- అల్పపీడనం ప్రభావం ఉంటే ఆయా రోజుల్లో సముద్ర తీరానికి వెళ్లకపోవడం మంచిది.

- ఏ తీరంలో ప్రమాదం జరిగినా ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే మెరైన్ పోలీసుల సాయం లభిస్తుంది.

1093

పర్యాటక బీచ్‌లు ఇవే..

జిల్లాలోని బారువ, శివసాగర్ (అక్కుపల్లి), భావనపాడు, గనగళ్లవానిపేట, దిబ్బలపాడు, కుప్పిలి, డి.మత్స్యలేశం, మొగదాలపాడు, బాహుదా సాగర్, సంగాం, డొంకూరు, ఒంటూరు, కవిటి, పితాళి, లక్ష్మీపురం, మెట్టూరు, రాజారాంపురం, దేవునల్తాడ, వజ్రపుకొత్తూరు, ఇద్దివానిపాలెం తీరాలకు ఏటా అధిక సంఖ్యలో వన భోజనాలకు వెళ్తారు.

ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు..

- పిక్నిక్ ప్లాన్ చేసే ముందే బీచ్‌లో నీటి లోతు, అలల ఉద్ధృతి గురించి తెలుసుకుంటే మంచిది.
- పిల్లలను పెద్దలు, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ ఉండాలి.
- తీరంలో విహరించే సమయంలో పరిమితికి మించి బోటు ఎక్కకూడదు. లైఫ్ జాకెట్లను తప్పని సరిగా ధరించాలి.
- ముఖ్యంగా మిగిలిన రోజుల కంటే అమావాస్య రోజుల్లో అలల ఉద్ధృతి అధికంగా ఉంటుంది.
- కోతకు గురైన తీర ప్రాంతానికి వెళ్లకూడదు.
- బీచ్ ప్రాంతంలో మద్యం దుకాణాలు, బెల్టు దుకాణాలు లేకుండా చూడాలి. పర్యాటకులు సైతం మద్యం సేవించడంపై నిషేధం ఉండాలి.
- జన సంచారం లేని తీరానికి దూరంగా ఉండాలి.
- లోతైన ఇతర ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అలాగే గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి.
- బీచ్‌లో సందర్శకుల తాకిడి అధికంగా ఉన్నప్పుడు స్థానిక పోలీసులతో పాటు మెరైన్ పోలీసులు అందుబాటులో ఉండాలి. బీచ్‌లో ఎంత దూరం వరకు శ్రేయస్కరమో అధికారులు, పోలీస్ సిబ్బంది తగిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి సందర్శకులను అప్రమత్తం చేయాలి.

బీచ్‌లలో అప్రమత్తంగా ఉండాలి

బీచ్‌లలో పిక్నిక్‌లు చేసుకునే వారు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాలు జరగకుండా ఇప్పటికే బీచ్‌ల పరిధి గ్రామాల్లో కమిటీలు వేశాం. సముద్ర తీరంలో మునిగిపోకుండా ఉండేందుకు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతాం. స్థానికంగా ఉన్న పోలీసులతో సమన్వయంగా సముద్ర తీరంలో ప్రమాదాలను నివారించే చర్యలు చేపడుతున్నాం.

– డి.రాము, మెరైన్ సీఐ, భావనపాడు

కళింగపట్నం బీచ్‌లో సందర్శన లేదు

కళింగపట్నం బీచ్‌లో సందర్శన రద్దు చేశాం. ఈ ప్రాంతంలో అలల ఉద్ధృతి ఎక్కువై సముద్రం ముందుకు రావడంతో ముందస్తు చర్యలుగా సందర్శన రద్దు చేశాం. మిగిలిన మొగదాలపాడు, పెద్దగనగళ్లవానిపేట, కుందువానిపేట తీర ప్రాంతంలో ఇద్దరు ఎస్‌ఐల తో పాటు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నాం. పర్యాటకులు సముద్రం లోపలకు వెళ్లకుండా ఉండేందుకు గస్తీలు ముమ్మరం చేస్తున్నాం. నిషేధిత బీచ్‌ల వైపు పిక్నిక్‌లకు వెళ్లకపోవడం ఎంతో మంచిది.

– బి.ప్రసాదరావు, మెరైన్ సీఐ కళింగపట్నం.

ఘనంగా రఘునాథ్ పట్నాయక్ జయంతి



రఘునాథ్ పట్నాయక్ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న పలువురు నేతలు

జయపురం: మాజీ మంత్రి రఘునాథ్ పట్నాయక్ జయంతిని కోరాపుట్ పట్టణంలోని పలు సంస్థలు వేర్వేరుగా నిర్వహించాయి. శనివారం స్థానిక పవర్ హౌస్ కూడలి వద్ద గల రఘునాథ్ పట్నాయక్ విగ్రహం వద్ద రఘునాథ్ పట్నాయక్ స్మృతి కమిటీ నిర్వహించిన కార్యక్రమంలో అతిథులు, సభికులు శ్రద్ధాంజలి ఘటించారు. స్మృతి కమిటీ అధ్యక్షుడు జగన్నాథ్ మిశ్ర అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో ఉత్కళ సమ్మిళినీ కోరాపుట్ అధ్యక్షుడు మదన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ రఘునాథ్ పట్నాయక్ మంత్రిగా రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలు వివరించారు. కోరాపుట్ జిల్లాలో నల్కో, హాల్ పరిశ్రమలు, జయపురం న్యాయ కళాశాల, మహిళా కళాశాల ఏర్పాటులో ఆయన ఉద్యమం చిరస్మరణీమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు దుర్గా శంకర సాహు, ఉపాధ్యక్షుడు బినోద్ మహాపాత్రో, పూజ్యపూజ సంసద్ సలహాదారు కేదార్ బెహర, నారాయణ సాగర్, బైరాగీ చరణ సాహు, జయపురం సాహిత్య పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయక్, పాత్రికేయుడు చంద్రకాంత సువార్, వెంకటరావు పట్నాయక్, నిశాన్ పట్నాయక్, నవీణ మదల, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ భవనంలో..

కోరాపుట్ జిల్లా కాంగ్రెస్ భవనంలో రఘునాథ్ పట్నాయక్ జయంతి నిర్వహించారు. రఘునాథ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ చంద్ర నేపక్ , జిల్లా ఎస్టీ కాంగ్రెస్ సెల్ మాజీ అధ్యక్షుడు రామ నాయక్, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కాంత పాడీ, తదితరులు రఘునాథ్ పట్నాయక్ అందించిన సేవలను గుర్తు చేశారు.

ఉత్కళ సమ్మిళినీ..

ఉత్కళ సమ్మిళినీ కోరాపుట్ జిల్లా శాఖ కార్యాలయంలో రఘునాథ్ పట్నాయక్ జయంతిని నిర్వహించారు. ఉత్కళ సమ్మిళినీ అధ్యక్షుడు మదన్ మోహన్ నాయక్, మునిసిపాలిటీ మాజీ చైర్మన్ సూర్యనారాయణ రథ్, డాక్టర్ సురేష్ దాస్, హరిహర కరసుధా పట్నాయక్, బిరెన్ మోహన్ పట్నాయక్, ధిరేన్ మోహన్ పట్నాయక్, పరమేశ్వర పాత్రో, బీజేడీ నేత బాలా రాయ్ తదితరులు ప్రసంగించారు. రఘునాథ్ పట్నాయక్ జయపురం నుంచి 6 సార్లు విధాన సభకు ప్రాతినిధ్యం వహించారు. ఆర్థిక, న్యాయ శాఖల తోపాటు పలు శాఖల మంత్రిగా, న్యాయవాదిగా ప్రజలకు సేవలు అందించారు.

అశ్రునయనాలతో అంత్యక్రియలు



గాడ్ ఆఫ్ హానర్ సమర్పిస్తున్న దృశ్యం



మొదలవలస చిన్నారావు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: ఈనెల 13వ తేదీన రాజస్థాన్ రాష్ట్రంలోని బికనీరు వైర్లెస్ యూనిట్‌లో పనిచేస్తున్న ఫరీదుపేట గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మొదలవలస చిన్నారావు (33) ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆర్మీ అధికారులు గ్రామంలోని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందజేసి, మృతదేహం తరలింపునకు ఏర్పాట్లు చేశారు. మృతదేహాన్ని విశాఖపట్నం వరకు విమానంలో తీసుకొచ్చి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు. దీంతో కింతలిమిల్లు నుంచి జిల్లా మాజీ సైనిక ఉద్యోగులు, గ్రామ యువత బైక్ ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. మృతదేహంపై ఉంచిన జాతీయ జెండాను భార్య సులోచనకు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు గాడ్ ఆఫ్ హానర్ సమర్పించి, అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికోద్యోగుల అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, కార్యవర్గ సభ్యులు ఎస్.రామకృష్ణ, ఎం.సింహాచలం, పైడి రామారావులు పాల్గొన్నారు.

బ్యాంకులు భద్రతా ప్రమాణాలు పాటించాలి: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: బ్యాంకులు, నగదు లావాదేవీలు జరిగే (ఏటీఎం) కేంద్రాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని, సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బ్యాంకు అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో బ్యాంకు అధికారులు, కోఆర్డినేటర్లతో ఆర్థిక, సైబర్ నేరాలు తదితర అంశాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏటీఎం గార్డులు, క్యాష్‌ఏజెన్సీల వ్యక్తిగత వివరాలు ముందస్తుగా సేకరించి వారి ఆథరైజేషన్, లైసెన్సు, గన్ లైసెన్సు పరిశీలించాలన్నారు. సైబర్ నేరాలు జరిగేటప్పుడు గోల్డెన్ హవర్‌లో బ్యాంకు అధికారులు స్పందించాలని, సంబంధిత అకౌంట్లను ఫ్రీజ్ చేయాలన్నారు. బ్యాంకు ఖాతాదారులెవరైనా ఆన్‌లైన్ మోసాల భారిపడి బ్యాంకులకు వస్తే 1930 లేదా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయించాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు వివేకానంద, అప్పారావు, రాజశేఖర్, ప్రసాదరావు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మృతదేహానికి రీ పోస్టుమార్టం



వ్యక్తిని పాతిపెట్టిన స్థలాన్ని తహసీల్దార్‌కు చూపిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని గూడేం గ్రామానికి చెందిన బొంతల కరువాడు(79) సెప్టెంబర్ 18న గ్రామ సమీపంలోని చెరువులో పడి మృతి చెందాడు. ఈయన భార్య కొన్నేళ్ల క్రితమే మృత్యువాత పడింది. పిల్లలు సైతం ఎవ్వరూ లేరు. దీంతో భార్య తరుపు బంధువులే చనిపోయిన తర్వాత దహన సంస్కారాలు నిర్వహించారు. ఇది జరిగి 15 రోజులు గడిచింది. అయితే చనిపోయిన విధానం పలు అనుమానాలకు తావిస్తోందంటూ ఈయన తమ్ముడు బొంతల వాకయ్య కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని బొడ్డేపల్లి అంకమ్మ, బొడ్డేపల్లి వెంకినాయుడులుపై శ్రీకాకుళం రూరల్ పోలీస్టేషన్‌కు, ఎస్పీ గ్రీవెన్స్‌కు తన కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో విషయం తారాస్థాయికు వెళ్లడంతో శ్రీకాకుళం మండల తహసీల్దార్ గణపతిరావు ఆధ్వర్యంలో రిమ్స్ వైద్యులు, రూరల్ పోలీసులు కలిసి శనివారం గూడేంలోని శ్మశాన వాటికలో రీ పోస్టుమార్టం నిర్వహించారు. అయితే కరువాడ చనిపోయిన తర్వాత అతనికి సంబంధించిన ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

బుడితి సీహెచ్‌సీలో గుండె చికిత్స



రోగితో వైద్య సిబ్బంది

సారవకోట: మండలంలోని బుడితి సీహెచ్‌సీలో మొదటిసారి గుండె సంబంధిత చికిత్సను వైద్యులు ఎం.యుగంధర్, సిబ్బంది శనివారం అందించారు. జలుమూరు మండలం అచ్చుతాపురం గ్రామానికి చెందిన పుట్ట కురమయ్య గుండె సంబంధిత వ్యాధితో ఆస్పత్రికి వచ్చాడు. ఈయనను పరీక్షించిన వైద్యుడు యుగంధర్ వెంటనే ఆస్పత్రిలో ఈసీజీ పరీక్ష చేయించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో స్టెమీ ప్రోగ్రాంలో భాగంగా గుండె సంబంధిత వ్యాధుల కోసం ప్రత్యేకంగా పరికరాలు, ఇంజెక్షన్లు అందజేశారు. దీంతో ఆయన పరీక్షలు నిర్వహించి సుమారు రూ.40 వేలు విలువ గల ఇంజెక్షన్‌ను వేసి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గుండెకు వెళ్లే నరాల గోడలు మూసుకుపోవడం జరిగిందని దీనిని థ్రాంబోలసిస్ చేయడం అంటారని తెలిపారు. ఇటువంటి ఘటనలు ఇప్పటివరకు ఇక్కడ ఎదురు కాలేదని, శనివారం వచ్చిన కేసు ప్రప్రథమంగా తాము విజయవంతం చేశామన్నారు. ఆయనతో పాటు సిబ్బంది పుష్పా, రమ్య, రాజేశ్వరి, సోమేశ్వరి ఉన్నారు.

ఇద్దరిని మింగేసిన బావి

- కనిమెట్టలో బావిలో పడి ఇద్దరు మృతి
- మోటారు ఇంజిన్ కోసం దిగి మునిగిపోయిన వైనం



విలపిస్తున్న మధుసూదనరావు భార్య



మధుసూదనరావు (ఫైల్)

పొందూరు:

ఆ ఇంటి బావి ఇద్దరిని మింగేసింది. మోటారు ఇంజిన్ కోసం దిగిన కుటుంబ పెద్ద మునిగిపోవడంతో.. ఆయన కోసం దిగిన మేనల్లుడు కూడా తిరిగి బయటకు రాలేకపోయారు. ఈ సంఘటన పొందూరు మండంలోని కనిమెట్ట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కనిమెట్ట గ్రామానికి చెందిన రఘుపతి మధుసూదనరావు(50) అదే గ్రామానికి చెందిన కింతలి ఢిల్లీశ్వరరావు(23)లు మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు..

మధుసూదనరావు ఇంటిలోకి శుక్రవారం రాత్రి విషసర్పం రావడంతో దాన్ని చంపేందుకు ప్రయత్నించారు. గాయమైన పాము ఇంటి నందల బావిలో పడిపోయింది. పాము నూతిలో పడిపోవడంతో శనివారం ఉదయం మధుసూదనరావు, అతని మేనల్లుడు కింతలి ఢిల్లీశ్వరరావు పామును తీసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆయిల్ ఇంజిన్‌తో బావిలో నీటిని తోడుతుండగా ఇంజిన్ బావిలో పడిపోయింది. దీన్ని బావిలో నుంచి తీసేందుకు మధుసూదనరావు దిగాడు. బావిలోకి దిగిన మధుసూదనరావు ఎంతకీ పైకి రాకపోవడంతో అతని మేనల్లుడు కింతలి ఢిల్లీశ్వరరావు కూడా బావిలోకి దిగాడు. కానీ ఇద్దరూ బయటకు రాలేకపోయారు. బావిలో ఎక్కువగా నీరు ఉండటంతో పాటు ఇంజిన్ ఆయిల్ మొత్తం విస్తరించి ఉండడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రయత్నించి మొదటి ఢిల్లీశ్వరరావును బయటకు తీశారు. తర్వాత మధుసూదనరావును బయటకు తీశారు. మధుసూదనరావు తలకు తీవ్రగాయమైనట్లు గుర్తించారు. ఇద్దరూ చనిపోయారు.



ఇద్దరి మృతికి కారణమైన బావి



ఢిల్లీశ్వరరావు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు



ఢిల్లీశ్వరరావు(ఫైల్)

కనిమెట్టలో విషాద ఛాయలు..

వ్యవసాయం చేసే మధుసూదనరావు, ఐటీఐ పాసై ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న ఢిల్లీశ్వరరావు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మధుసూదనరావుకు భార్య సరస్వతి, కుమారుడు జగదీశ్వరరావు, వివాహమైన కుమార్తె తిరుమల ఉన్నారు. ఢిల్లీశ్వరరావు తల్లిదండ్రులు కింతలి చౌదరి, రాజేశ్వరి కుమారుడు మృతి చెందాడని తెలియడంతో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. శవపంచనామా నిర్వహించి మృత దేహాలను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ పరిశీలించారు.

ఉపాధ్యాయిని ఆత్మహత్య



నవ్య మృతదేహం

కాశీబుగ్గ: పలాస మండలం ఈదురాపల్లి గ్రామానికి చెందిన శాశనపురి నవ్య (32) శనివారం ఉదయం ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆమె ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం స్వగ్రామం ఈదురాపల్లిలోని తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు వేలాడుతూ కనిపించిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని దించి పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. నవ్య భర్త ఎన్ని షణ్ముఖరావు ఇండియన్ ఆర్మీలో ఉన్నతమైన ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరూ గ్రామానికే కాదు పరిసర ప్రాంతాలకే ఆదర్శంగా నిలిచారు. అటువంటి వారి కుటుంబంలో ఎమైందో ఏమో కాని ఆమె శవమై పోవడంతో అందరూ శోకసంద్రంలో మునిగిపోయారు. వీరికి రెండేళ్ల పాప ఉంది. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విభిన్న ప్రతిభవంతుల ఆటల పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు కేటగిరీల వారీగా (స్త్రీ, పురుషులకు వేర్వేరుగా) ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కె.కవిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు కలెక్టరేటు దగ్గరలో, డీఆర్‌డీఏ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న డచ్ భవనం మైదానంలో నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో ఈనెల 20వ తేదీ ఉదయం 10.00 గంటల నుంచి ఆటల పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. సదరు ఆటల పోటీల్లో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు అందరూ పాల్గొవాలని కోరారు.

క్లుప్తంగా

వృద్ధుడి అదృశ్యం


సూరిబాబు (ఫైల్)

గంట్యాడ: మండలంలోని నీలావతి గ్రామానికి చెందిన మురపాక సూరిబాబు అనే వృద్ధుడు కనిపించడం లేదు. ఈ నెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు పశువుల కళ్లానికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అతనికి మతిస్థిమితం లేకపోవడంతో పాటు ఫిట్స్ వ్యాధి కూడా ఉంది. సమీప గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో అతని కుమారుడు ఆనంద్ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

ఆచూకీ తెలపండి..


గాది అప్పారావు

విజయనగరం క్రైమ్: మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి ఆచూకీ తెలిజేయాలని బాధిత కుటుంబ సభ్యులు శనవారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని ఆదర్శనగర్ రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ వెనుక వీధిలో నివాసం ఉంటున్న గాది అప్పారావు (57) కొంతకాలంగా మతిస్థిమితం లేక ఇబ్బంది పడుతున్నాడు. అక్టోబర్ 13న రాత్రి బయటకు వచ్చిన అప్పారావు తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో అప్పారావు భార్య సాయి, కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పారావు ఆచూకీ తెలిసిన వారు 76749 93903 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దివ్యాంగుడి ఆత్మహత్య

లక్కవరపుకోట: మండలంలోని భీమాళి గ్రామానికి చెందిన దివ్యాంగుడు గుల్లిపల్లి సంతోష్ (37) జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై నవీన్ పడాల్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. సంతోష్ మద్యానికి బానిసై తనకు వచ్చిన పెన్షన్ డబ్బులు ఖర్చు చేస్తుండడంతో భార్య సంతోషతో ఎప్పటికప్పుడు గొడవలు జరుగుతుండేవి. శనివారం కూడా మద్యం తాగి రావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సంతోష్ ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగు మంది అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడ్ని విజయనగరం ఆస్పత్రికి తరలించగా..అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సంతోషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువతి..

విజయనగరం క్రైమ్: తీవ్రమైన కడుపునొప్పి, తలనొప్పి తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. పడాలపేట గ్రామానికి చెందిన పడాల వీర వెంకటలక్ష్మి (19) ఎంవీజీఆర్ కళాశాలలో బీటెక్ సెకెండ్ ఇయర్ చదువుతోంది. కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పి, తలనొప్పితో బాధపడుతోంది. రెండురోజుల కిందట కడుపునొప్పి ఎక్కువ కావడంతో పెప్సీ లో పురుగు మందు కలిపి తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అ క్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి పైడిరాజు ఇచ్చిన ఫి ర్యాదు మేరకు రూరల్ ఎస్సై వి.అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోడ కూలి వ్యక్తి మృతి


శంకరరావు మృతదేహం

సాలూరు: గోడ కూలి ఒకరు మృతి చెందిన సంఘటన పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. సీఐ అప్పలనాయుడు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బంగారమ్మపేటకు చెందిన నల్ల శంకరరావు (40) నెయ్యిలవీధిలో వి.మాధవరావు ఇంటి గోడలు కూల్చే పని ఒప్పుకున్నాడు. ఈ మేరకు కూల్చివేత పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ గోడ శంకరరావుపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మరియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు.

సివిల్స్‌లో ఉచిత శిక్షణ

పార్వతీపురం టౌన్: సివిల్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ ఇచ్చేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొనే వారు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. 2 ఫొటోలు, విద్యా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు జత పరచి ఈ నెల 24లోగా దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయం, 8ఎఫ్ రూమ్ నెంబర్ ఆర్‌సీఎం స్కూల్ బిల్డింగ్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సమర్పించాలన్నారు. వివరాలకు 97001 12711 నంబరును సంప్రదించాలని సూచించారు.

నవీకరణ దిశగా సహకార సంఘాలు..

- శరవేగంగా సాగుతున్న సహకార సంఘాల రికార్డుల కంప్యూటరీకరణ
- ఈ నెల 20 నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు
- ఇప్పటికే 90 శాతం సొసైటీల రికార్డుల కంప్యూటరీకరణ పూర్తి


కొత్తవలసలో డీసీసీబీ బ్రాంచ్‌లో సేవలు అందుకుంటున్న ఖాతాదారులు


లక్కవరపుకోట పీఏసీఎస్ కేంద్రంలో రికార్డులను కంప్యూటరీకరణ చేస్తున్న సిబ్బంది

లక్కవరపుకోట: ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడంలో సహకార సంఘాల పాత్ర కీలకం. వాటిని మరింత బలోపేతం చేసి రైతులకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అడుగులు వేసింది. ఇప్పటిదాకా చలామణి అవుతున్న సేవలను నవీకరణ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేసేలా కార్యాచరణ ప్రారంభించింది. తద్వారా సహకార సంఘాల్లో బినామీలు, తప్పుడు పత్రాలతో రుణాలు, ఇతర తప్పులకు చెక్ పడనుంది. నేషనల్ బ్యాంక్ తరహాలో రుణాల వివరాలన్నీ కంప్యూటరీకరణ జరుగుతోంది. దీంతో ప్రతి పైసాకూ కచ్చితమైన లెక్క ఉంటుంది.

ఎన్నో ఉపయోగాలు..

పీఏసీఎస్‌లను నాబార్డు సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు జాతీయ నెట్‌వర్క్‌లతో అనుసంధానం చేసేలా కేంద్ర సహకార మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టింది. దీంతో సొసైటీలో నమోదైన ప్రతి ఖాతాదారుడికీ కంప్యూటరైజ్డ్ పాస్‌బుక్ వస్తుంది. అందులో తీసుకున్న రుణం, చెల్లిస్తున్న సొమ్ము, ఖాతాకు జమవుతున్న వడ్డీ, తదితర వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలన్నీ నేరుగా రైతుల ఖాతాలకే జమకానున్నాయి.

95 సహకార సంఘాలు..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 95 సహకార సంఘాలున్నాయి. ఈ సంఘాల పరిధిలో సుమారుగా సుమారు 5.26 లక్షల మంది ఖాతాదారులున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు 400 కోట్ల రూపాయల రుణాలు సైతం అందజేశారు. కాగా ఇప్పటివరకు ఈ సంఘాల రికార్డుల నిర్వహణ పూర్తిగా చేతిరాతలతోనే జరుగుతున్నాయి. నిర్వహణలో పారదర్శకత లేకపోవడంతో కోట్ల రూపాయలు అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వీటన్నిటికీ చెక్ పెట్టేందుకు కేంద్ర సహకార మంత్రిత్వశాఖ నడుం బిగించింది. సహకార సంఘాలకు చెందిన అన్నిరకాల రికార్డులు, సేవలను పూర్తిగా కంప్యూటరీకరణ చేసి ఆన్‌లైన్ సేవలకు తెరతీసింది. దీంతో ప్రతి సహకార సంఘ రికార్డులను కంప్యూటరీకరణ చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయారు. ఇప్పటికే జిల్లాలో 90 శాతం వరకు ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా సహకార సంఘం బ్యాంక్ సీఈఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కంప్యూటరీకరణ నాబార్డు నిధులతో నిర్వహిస్తున్నారు.

పారదర్శక సేవలే లక్ష్యం..

ప్రాథమిక సహకార సంఘాల ద్వారా సేవలను మరింత విస్తృతం చేసేందుకే నవీకరణ దిశగా శ్రీకారం చుట్టాం. అక్రమాలకు తావులేకుండా పారదర్శక సేవలు అందాలన్నదే లక్ష్యం. ఈ ప్రక్రియ అమల్లోకి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన ఆన్‌లైన్ నమోదు కొనసాగుతోంది. ఉద్యోగులంతా దీనిపైనే కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 90 శాతానికి పైగా డేటా ఎంట్రీ పూర్తయింది. అలాగే 8 సొసైటీలకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇందులో సీతానగరం సొసైటీలో ఆన్‌లైన్ సేవలకు అనుమతులు వచ్చాయి.

– సీహెచ్ ఉమామహేశ్వరరావు, సీఈఓ, జిల్లా సహకార సంఘ బ్యాంక్

డ్రోన్స్‌తో నేరాలకు చెక్

- ఎస్పీ వకుల్‌జిందాల్


డ్రోన్ కెమెరాను పర్యవేక్షిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా వ్యాప్తంగా నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్‌ను వినియోగిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఈ మేరకు పరేడ్‌గ్రౌండ్‌లో డ్రోన్స్ పనితీరు, చేపట్టాల్సిన విధివిధానాలను అధికారులు, సాంకేతిక నిపుణులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను నియంత్రిస్తామన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్‌టీజింగ్, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహించే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్‌తో నిఘా పెడతామని చెప్పారు. పట్టణంలోని జేఎన్‌టీయూ, కలెక్టరేట్ జంక్షన్, కేఎల్ పురం, మయూరి కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, తోటపాలెం, బాలాజీ జంక్షన్ వంటి ప్రాంతాల్లో కూడా నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ముఖ్య కూడళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, షాపులు, కళాశాలలు, వాణిజ్య సముదాయాలు, ప్రధాన రహదారులపై సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటికి అదనంగా మరిన్ని సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకునేలా షాపు యజమానులు, వ్యాపారవేత్తలు, అపార్ట్‌మెంట్‌వాసులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన సదస్సులు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఈ నెల 19న ప్రపంచ మరుగుదొడ్ల దినం సందర్భంగా ఆ రోజు నుంచి వచ్చే నెల పదో తేదీ వరకు హమారా సౌచాలయ, హమారా సమ్మాన్ పేరుతో మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సదస్సులను జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిల్లో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఈ నెల 19న టాయిలెట్లు మంజూరైన వారందరికీ మంజూరు లేఖలు అందించాలని తెలిపారు. అలాగే గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ వ్యక్తిగత, కమ్యూనిటీ మరుగుదొడ్లకు బహుమతులు అందజేయాలని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డ్వామా ఇన్‌చార్జ్ పీడీ కల్యాణ చక్రవర్తి, డీపీఓ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా


ట్రోఫీ అందుకుంటున్న రాజు, శ్రీనివాసరెడ్డి

విజయనగరం: ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విజయనగరం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 13 నుంచి పాలకొల్లులో నిర్వహించిన పోటీల్లో 65 సంవత్సరాల డబుల్స్ విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన జీవీఎస్ రాజు, శ్రీనివాసరెడ్డి జోడి ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఈ మేరకు ఇరువురు క్రీడాకారులను జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు సీనియర్ క్రీడాకారులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి విజయనగరం కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలపైనా చర్యలు తీసుకోండి..

- వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదు


వన్‌టౌన్ ఎస్సై రామగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరులు

విజయనగరం క్రైమ్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల మీద అసభ్యకర పోస్టులు పెట్టిన టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం స్థానిక వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రామగణేష్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ, టీడీపీకి అనుబంధంగా ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు చేస్తున్న హానికరమైన కార్యకలాపాలపై తక్షణమే దృష్టి సారించాలన్నారు. టీడీపీతో సంబంధమున్న సోషల్ మీడియా కార్యకర్తలు నిరాధారమైన ఆరోపణలు చేయడం వల్ల శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని చెప్పారు. వారిపై సరైన చర్యలు తీసుకోకపోవడంతో మరింతగా రెచ్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వంలోని కొంతమంది తమ పార్టీ పేరుతో ఫేక్ ఐడీలు సృష్టించి అధికార పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తమ అధినేత జగన్‌మోహన్ రెడ్డిపై జుగుప్సాకరమైన పోస్టులు పెడుతూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, టీడీపీ సోషల్ మీడియా వికృత చేష్టలపై కూడా చర్యలు తీసుకుని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీరుబండి జైహింద్‌కుమార్, ఆశపు వేణు, జీవీ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలు

- జిల్లా పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్


పాత్రికేయుడిని సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

విజయనగరం: పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలని జిల్లా పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరక్టర్ రమేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం జరిగిన జాతీయ పత్రికా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ, సమాజానికి దిశా, నిర్దేశం చేయడంలో పత్రికలు అద్వితీయ పాత్రను పోషిస్తున్నాయని చెప్పారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం. జయచంద్రనాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే ఉన్నత లక్ష్యాలను అధిగమించవచ్చన్నారు. పుస్తకాలను మించిన నేస్తాలు ఉండరని, అటువంటి పుస్తకాలు కొలువుండే గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలని తెలిపారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2024 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం పురస్కారాన్ని సీనియర్ పాత్రికేయుడు, విశాఖ టుడే సంపాదకుడు సూరె మహేష్‌కు ప్రదానం చేశారు. అలాగే వివిధ పాఠశాలలకు చెందిన వందమంది విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి, గ్రంథాలయ సంఘ కార్యదర్శి ఎం. సుభద్రాదేవి, మహిళా విభాగం కార్యదర్శి గిరిజా ప్రసన్న, పులిపాటి రామారావు, గీతాంజలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆస్తులు స్వాధీనం చేసుకుంటాం..

- డీఐజీ గోపీనాథ్ జెట్టి


ఐదు జిల్లాల పోలీసు అధికారులతో సమీక్ష చేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైమ్: గంజాయి స్మగ్లర్లు, వారి మద్దతుదారులు వివిధ రూపాల్లో కూడబెట్టిన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. ఐదు జిల్లాల పోలీసు అధికారులతో విశాఖలోని డీఐజీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగుకు ఆర్థికంగా మద్దుతు తెలుపుతున్న వ్యాపారస్తులపై ఆరా తీశారు. గంజాయి ద్వారా కూడబెట్టిన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధమైందన్నారు. సమావేశంలో ఐదు జిల్లాల పోలీసు అధికారులు, లీగల్ అడ్వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత స్థానం..


మాట్లాడుతున్న కర్ణాటక సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ మిత్తిరెడ్డి కూర్మారావు

దత్తిరాజేరు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని దత్తిరాజేరు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, కర్ణాటక రాష్ట్ర సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మిత్తిరెడ్డి కూర్మారావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వ్యవసాయ కుటుంబానికి చెందిన తాను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నానని తెలిపారు. కష్టపడి చదివి ఐఏఎస్ సాధించానని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఆయన వెంట డీఈఓ మాణిక్యాలనాయుడు, డిప్యూటీ డీఈఓ మోహనరావు, ఎంఈఓలు వెంకటరావు, సుధాకర్, హెచ్‌ఎం స్వర్ణకుమారి ఉన్నారు.

జిల్లాలో 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

పార్వతీపురం టౌన్: మండలంలోని పెదబొండపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఒక్కో కేంద్రం వద్ద ముగ్గురు చొప్పున తాత్కాలిక సిబ్బందిని నియమిస్తామన్నారు. బ్యాంక్ గ్యారంటీల విషయమై జిల్లాలోని మిల్లర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రైతులు వారికి నచ్చిన మిల్లులకు ధాన్యం తరలించుకోవచ్చన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయమై ఏమైనా ఫిర్యాదులుంటే కలెక్టర్ వారి కార్యాలయంలోను, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని సూచించారు.

ఎల్‌టీఆర్ కేసులపై విచారణ


విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: ఎల్‌టీఆర్ కేసులపై పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శనివారం విచారణ చేపట్టారు. ఎల్విన్‌పేట గిరిజన సంక్షేమ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో గుమ్మలక్ష్మీపురం మండలం దిగువమండ, కురుపాం మండలం నీలకంఠాపురం గ్రామాలకు చెందిన కేసులను విచారించారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతీ ఒక్కరూ పాటించాలని సూచించారు. సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరుపెక్కిన విజయనగరం..


కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం రోడ్డులో భారీ ర్యాలీ


బొంకులదిబ్బ వద్ద బహిరంగ సభలో అభివాదం చేస్తున్న నాయకులు


రెడ్‌షర్ట్స్ వలంటీర్ల ర్యాలీ

విజయనగరం ఫూల్‌బాగ్: సీపీఎం పదో జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా కేంద్రం ఎరుపెక్కింది.. అరుణ పతాకాలతో సీపీఎం దండు శనివారం భారీ ప్రదర్శన నిర్వహించింది. స్థానిక ఎన్‌సీఎస్ జంక్షన్ నుంచి కన్యకా పరమేశ్వరి కోవెల, గంటస్తంభం, మూడు లాంతర్లు మీదగా బొంకులదిబ్బ వరకు అరుణ పతాకాలతో ర్యాలీ చేపట్టారు. ఈ ప్రదర్శనలో రెడ్‌షర్ట్ వలంటీర్స్, డప్పు కళాకారులు, చిన్నపిల్లల కోలాటం ఆకట్టుకుంది. అనంతరం బొంకులుదిబ్బ వద్ద నిర్వహించిన బహిరంగ సబలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రధాని మోదీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మూడోసారి అధికారంలోకి వచ్చారన్నారు. అయితే ఇంతవరకు ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. లోకనాథం మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ అమ్ముతుంటే ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ స్టీల్‌ప్లాంట్‌కు కూతవేటు దూరంలో మిట్టల్ స్టీల్ కంపెనీకి ఎలా పర్మిషన్ ఇచ్చారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న జమిలి ఎన్నికలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకిచాలన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే స్థానిక సంస్థలు నీరుగారి పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించేతత్వం ఉండదని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ మాట్లాడుతూ.. జిందాల్ పోరాటం, రాజాం వంగడం పోరాటం, బొబ్బిలి మైదానం పోరాటం.. ఇలా ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించామని, భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కె. సురేష్, టీవీ రమణ, ఆర్. శంకరరావు పాల్గొన్నారు.

చిన్నారులకు విధిగా టీకాలు వేయాలి


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్మ్యునైజేషన్ ఆఫీసర్ నారాయణ

- జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి నారాయణ

పార్వతీపురం టౌన్: చిన్నారులకు విధిగా టీకాలు వేయాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ ఆఫీసర్ ఎం.నారాయణ అన్నారు. మండలంలోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అడ్డాపుశీల, బంటువానివలస ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయన శనివారం సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని పరిశీలించి టీకా కార్డులు తనిఖీ చేసి, సకాలంలో పిల్లలకు టీకాలు వేస్తున్నారా.. లేదా.. అన్నది తేదీలతో సహ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల్లో శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల ప్రభావం ఏమైనా ఉందా, శానిటేషన్ తీరు, స్ప్రేయింగ్ నిర్వహణ తదితర వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఆర్‌సీహెచ్, ఎంసీపీ రికార్డుల్లో గర్భిణులు, పిల్లల టీకాల గడువు తేదీలను, టీకాలు వేస్తున్న తేదీలతో సరిచూసారు. అనంతరం మాట్లాడుతూ నీటి స్వచ్ఛత పరీక్షలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పలు రకాల వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రైడే అందరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్‌ఎం ఎ.శాంతికుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.